క్లుప్తంగా

బోనస్‌తో రైతుల్లో ఆనందం

బెజ్జంకి(సిద్దిపేట): సన్నవడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో పాటు రుణమాఫీ చేయడంతో రైతుల్లో ఆనందం నెలకొందని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఐలేని శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే కొంత జాప్యం జరిగినా హామీలన్నీ పూర్తి చేస్తోందన్నారు.

మల్లన్నకు వెండి చెంబు బహూకరించిన దాతలు



వెండి చెంబును అందజేస్తున్న దాతలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్నకు ఆదివారం సికింద్రాబాద్‌కు చెందిన వేణుగోపాల్ ధరణి దంపతులు 428 గ్రాముల వెండి చెంబును బహూకరించారు. వారు మాట్లాడుతూ స్వామివారిని ప్రతి సంవత్సరం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): మండలంలోని నాగిరెడ్డిపల్లిలో చల్ల నర్సింహారెడ్డి 18వ మాలధారణ సందర్భంగా ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుంట్ల లక్ష్మారెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి నవీన్‌కుమార్, గురుస్వామి మురళీధర్‌శర్మ, అయ్యప్ప మాల ధారులు పూజల్లో పాల్గొన్నారు.

శ్రీపతికి సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): ఇటీవల పద్మశాలి సంఘం ఐక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియామకమైన బూట్ల శ్రీపతిని ఆదివారం స్థానిక సత్యార్జున ఫంక్షన్ హాల్‌లో సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ద్యావనపల్లి శ్రీనివాస్, సూర్యప్రకాశ్, వెంకటేశం, మల్లేశం, సత్యనారాయణ, రవీందర్, పండరి, రాజు, గౌరీశంకర్, రమేశ్, ప్రసాద్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడిగా రవీందర్ బెజ్జంకి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం నిర్వహించగా చేర్యాల రవీందర్ గెలుపొందినట్లు సంఘం నాయకులు ప్రకటించారు. ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన చాకలి కనకయ్య, బొల్లు మల్లయ్యలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మానస్ రంజిత్, నాయకులు బాల్ నర్సాగౌడ్, రామస్వామి, బుచ్చులు, కిషన్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ఎంతో ఆనందం



చందును సన్మానిస్తున్న భాస్కర్

బెజ్జంకి(సిద్దిపేట): శిష్యులు ఉన్నతస్థానాలకు ఎదిగినప్పుడు గురువులకు ఎంతో ఆనందం కలుగుతుందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని గుండారంలో ఇటీవల బీఎస్‌ఎఫ్‌లో ఉద్యోగం పొంది రాజస్థాన్ బోర్డర్‌లో ఉద్యోగం చేస్తున్న గొడ్డేటి చందును ఆదివారం ఆయన స్వగ్రామంలో సన్మానించారు. కార్యక్రమంలో గుండ్లపల్లె మాజీ సర్పంచ్, రెడ్డి సంఘం గన్నేరువరం మండల అధ్యక్షుడు బేతెల్లి రాజేందర్‌రెడ్డి, గోవర్దన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన చెత్తశుద్ధి

- నిరుపయోగంగా డంపింగ్ షెడ్లు
- తయారుకాని ఎరువు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



ఇబ్రహీంనగర్‌లో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ షెడ్డు



రాముని‌పట్లలో డంపింగ్ యార్డు పక్కనే కాలుస్తున్న చెత్త

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు పంచాయతీలకు తగిన ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతి పంచాయతీ పరిధిలోను కంపోస్టు షెడ్లు నిర్మించింది. గ్రామాల శుభ్రతకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే అయినా కిందిస్థాయి ఉద్యోగుల అలసత్వం కారణంగా నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో 25పంచాయతీల్లో ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.12లక్షలు వెచ్చించింది. అయితే ఈ షెడ్లు కొన్ని పంచాయతీల్లో గ్రామానికి దూరంగా ఉండటంతో వినియోగించడం లేదు. ప్రతి జీపీకి ఒక ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. కొన్ని చోట్ల నిత్యం జరగకపోవడంతో ప్రజలు ఖాళీ స్థలాల్లో చెత్త పడేస్తున్నారు.

తయారుకాని ఎరువు

గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేందుకు గతంలో డస్ట్‌బిన్‌లు పంపిణీ చేసింది. కంపోస్టు షెడ్లు నిర్మించి బ్లాకుల వారీగా నిర్మాణాలు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేయకుండా ఇష్టానుసారంగా అందిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వాటిని వేరు చేసి షెడ్లలో వేసి ఎరువు తయారు చేయాలి. అలా తయారైన ఎరువును పంచాయతీలు విక్రయించి అదనపు ఆదాయాన్ని పెంచుకోవాలనేది వాటి ఉద్దేశ్యం. కాని కొన్ని గ్రామాల్లో ఎరువు తయారు చేస్తున్న దాఖలాలు లేవు. కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయి.

డంపింగ్ యార్డుకు తరలని చెత్త..

గ్రామాల్లోని చెత్త డంపింగ్ యార్డుకు తరలడం లేదు. రోడ్ల పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి గ్రామ శివారులో పడేసి మంట పెడుతున్నారు. దీంతో దారిన వెళ్లే వారికి సమస్యగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్, డంపింగ్ యార్డుల నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ షెడ్లను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి చెత్తను ప్రతిరోజూ డంపింగ్ యార్డుకు తరలించేలా ఆదేశాలు జారీచేస్తా..

– జనార్దన్, ఎంపీడీఓ, చిన్నకోడూరు

స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్



భూమిపూజ చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: భారతదేశ తొలి ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారని పలువురు హైందవ సోదరులు కొనియాడారు. పటేల్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పటేల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. రామకోటి రామరాజు సబ్బు బిళ్లపై వల్లభాయ్ పటేల్ రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ములుగు(గజ్వేల్): విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు

ములుగు(గజ్వేల్): విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సూచించారు. ములుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు కండ్లకలక వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసి ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో భోజనం, ఇతర సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట అహ్మద్ తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బస్వాపూర్‌కు చెందిన బస్వరాజు యాదగిరి ఇటీవల మృతి చెందాడు. అతడికి మంజూరైన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే కేసీఆర్ ప్రమాద బీమాను ప్రవేశపెట్టారన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, లోలక్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, యాదగిరి, నర్సింహారెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

డ్రగ్స్ నివారణ కోసం 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న యువకులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్‌లో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీలకతీతంగా 2కే రన్‌లో పాల్గొన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొడతామని పంచాయతీ వద్ద యువకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట మకమలాకర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్మల దేవరాజు, బీఆర్‌ఎస్ నాయకులు రాజ మహేందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, మాజీ సర్పంచ్ అగురం కనకారెడ్డి, ఎంపీటీసీ గొట్టం భైరయ్య, కవి ముక్కపల్లి శ్రీనివాస్, విజయ్, దశరథం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిరుదొడ్డి(దుబ్బాక): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. 1986–87 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు 37యేళ్ల తర్వాత ఆదివారం మిరుదొడ్డిలో కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సహపంక్తి భోజనాలుచేసి సందడిగా గడిపారు. విద్యాబుద్ధులు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులు మృత్యుంజయ శర్మ, పృథ్వీరాజ్, రుస్తుంలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు.

లద్నూరు పాఠశాలలో..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–2004 పూర్వ విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. ఆనాటి తమ గురువులను ఘనంగా సత్కరించారు.



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరు ఉన్నత పాఠశాలలో 2003-2004బ్యాచ్ విద్యార్థులు

బియ్యానికి బదులు నగదు ఇయ్యాలె..

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం పేదలకు ఇచ్చే రేషన్ బియ్యానికి బదులు నగదు బదిలీ చేయాలని ముదిరాజ్ మండల మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ కోరారు. హుస్నాబాద్‌లో ఆదివారం మాట్లాడుతూ పేదల కోసం ఇచ్చే బియ్యంలో నాణ్యత లేకపోవడం వల్ల లబ్ధిదారులు బియ్యం అమ్మేసుకుంటున్నారన్నారు. గ్రామాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని మిల్లర్స్ కొనుగోలు చేసి వాటినే తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ దందాను అరికట్టాలంటే బియ్యానికి బదులు పేదలకు నగదు బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

గజ్వేల్‌రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్‌తో కలిసి ఆదివారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజురు చేస్తోందన్నారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలను అందించనుందని, సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేశ్, సాహెద్, యాదగిరి, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

కల్హేర్(నారాయణఖేడ్): అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని మార్డి తండాలో ఆదివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన హెమ్లనాయక్‌కు సంబంధించిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. వంట సరుకులు, సామగ్రి దగ్ధమైంది. ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని బాధితుడు కోరారు. మాజీ ఎంపీపీ గుర్రపు సుశీల బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు ఉప్పరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘డివిజన్’ ప్రకటించకపోతే ఉద్యమం ఉధృతం



సమావేశమైన అఖిల పక్షం నాయకులు

అఖిలపక్ష నాయకులు

దుబ్బాక: ప్రభుత్వం దుబ్బాక రెవెన్యూ డివిజన్‌ను వెంటనే ప్రకటించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. దుబ్బాకలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాడబోయిన శ్రీకాంత్, ఆస యాదగిరి, నవీన, భాస్కర్ మాట్లాడారు. నియోజకవర్గం కేంద్రాలైన సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ కేంద్రాలుగా ఉన్నాయని, దుబ్బాకను ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా జరిగిన సభలో హామీ ఇచ్చారని, అలాగే ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు కూడా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డివిజన్ కోసం పార్టీలకతీతంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాజిత్, ఎల్లం, లక్ష్మీనారాయణ, మల్లేశం, సుంకోజి ప్రవీణ్, శ్రీకాంత్, మల్లికార్జున్, దీక్షిత్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.



గోనెపల్లి ప్రాథమిక పాఠశాలలో పచ్చదనం

ప్రకృతి ఒడి .. పచ్చని బడి

ప్రభుత్వ పాఠశాలలు ఒకప్పుడు చెత్త, చెదారం, పిచ్చి మొక్కలకు నిలయంగా ఉండేవి. కానీ ప్రస్తుతం అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణానికి, పచ్చదనానికి నిలయంగా మారాయి. మండల పరిధిలోని గోనెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పచ్చదనం ఉట్టిపడుతోంది. విద్యార్థులు పచ్చని చెట్ల మధ్య ప్రశాంతంగా విద్యను అభ్యసిస్తున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట):

‘రసాయనం’.. అపాయకరం

- మోతాదుకు మించి ఎరువుల వాడకం
- భవిష్యత్‌లో చౌట భూములుగా మారే అవకాశం
- సేంద్రియ ఎరువులపై అవగాహన కరువు

అధిక దిగుబడి సాధించేందుకు రైతులు రసాయన ఎరువులను విరివిగా వాడుతున్నారు. పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, వర్మికం పోస్టు, వానపాముల ఎరువుల తదితర సహజ ఎరువులు వాడక పోవడంతో రోజురోజుకూ భూసారం తగ్గుతోంది. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడకం నేల సహజ స్వరూపాన్ని మార్చేస్తోంది. రసాయనాల ప్రభావంతో భూమిలోని ముతక లోహాలు క్షీణిస్తున్నాయి. ఇది భవిష్యత్‌లో చాలా ప్రమాదకరమని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రసాయన ఎరువు చల్లుతున్న రైతు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలో భూసార పరీక్ష కేంద్రం ఉన్నా ఎక్కువ మంది రైతులు తమ భూమిలో మట్టి పరీక్షలు చేయించడం లేదు. మట్టి పరీక్షలు చేయిస్తే ఏ ఎరువులు ఎంత మేర వాడాలనేది తెలుస్తుంది. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి రైతులకు చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యవసాయ అధికారులు వాపోతున్నారు.

గ్రామ స్థాయిల్లో పరీక్షలు చేస్తే మేలు

మండలంలో మొత్తం ఐదు రైతువేదికలు నిర్మించినా అక్కడ భూసార పరీక్షలుచేసే కిట్లను ఉంచడం లేదు. డివిజన్ పరిధిలోనో, మరెక్కడో కాకుండా క్లస్టర్ రైతు వేదికల్లో భూసార పరీక్షలు నిర్వహించాలని, మట్టిని సేకరించి పరీక్ష చేయించే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. మట్టిని ఎక్కడికో తీసుకువెళ్లి ఫలితాల కోసం చాలా రోజులపాటు వేచి చూడడం వల్ల రైతులు భూసార పరీక్షలకు పెద్దగా ఆసక్తి చూప డం లేదు.

పంట మార్పిడితో లాభాలు

భూమి సహజత్వాన్ని కాల్పోడానికి మరో కారణం పంట మార్పిడి విధానం అమలు చేయకపోవటం ఏడాదిలో ఒక భూమిలో కనీసం రెండే వేర్వేరు పంటలు పండించాలి. అలా చేస్తే పంటలకు అన్ని రకాల సారం అంది దిగుబడి పెరుగుతుంది. అలాగే రసాయన ఎరువుల వాడకం తగ్గే ఆస్కారం కూడా ఉంటుంది.

మోతాదుకు మించి..

వరి సాగుకు ఎకరానికి ఒక బస్తా యూరియా వాడాలి. కాని రైతులు మూడు, నాలుగు బస్తాలు చల్లుతున్నారు. సహజ ఎరువులను ఎంత వాడినా నేల స్వభావం మారదు. కాని రసాయన ఎరువుల ఎంత ఎక్కువ వాడితే నేల అంత పాడై రానురాను మొక్కల ఎదుగుదలలేకుండా పోతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

చెరువు మట్టితో నేలకు సారం

మెట్ట పంటలకు టిక్కిమట్టితో పాటు పశువులపేడ, మేకల, గొర్రెలు, కోడి ఎరువు వాడితే దిగుబడి పెరుగుతుంది. టిక్కిమట్టిలో హ్యూమస్ ఉండి నేల సారవంతంగా మారుతుంది. ఎలాంటి నేలనైనా పంటలకు అనుగుణంగా మార్చే శక్తి చెర్ల, కుంటల్లోని మట్టికి ఉంటుంది. అందుకే ఎండిన చెరువుల నుంచి ప్రతి ఎకరానికి వంద నుంచి 150ట్రిప్పుల ట్రాక్టర్ల మట్టిని పొలాల్లో వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇలాచేస్తే నేల పైపొర సారవంతంగా మారుతుంది. అలాగే పొలంలో తేమ ఎక్కువ రోజులు ఉంటుంది. దీంతో పంటలకు యూరియా, పొటాషియం వంటి ఎరువులు తక్కువ మోతాదులో వేసుకున్నా అధిక దిగుబడి వస్తుందని నిపుణులు చెప్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



సేంద్రియ ఎరువులు వాడితే చీడపీడల బెడద తగ్గడంతో పాటు మంచి దిగుబడులు వస్తాయి. ప్రతి సీజన్‌లో రైతు వేదికలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– రామకృష్ణ, ఏఓ, మద్దూరు